ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తలు

ముఖ్యాంశాలు

తేది : 01.01.2025 మధ్యాహ్నం 1310 గంటలు

ముఖ్యాంశాల

1. ఈ రోజు నుంచి ధరణి పోర్టల్‌ను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ – NIC పూర్తి స్థాయిలో నిర్వహించనుంది.
2. గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి తనిఖీలు చేపట్టాలని అధికారులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు
3. ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక ఉత్సవం కుంభమేళా ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగరాజ్ లో ఈ నెల 13న ప్రారంభం కానుంది.
4. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల తగ్గింపే లక్ష్యంగా ఈ రోజు నుంచి 31వ తేదీ వరకు రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసం నిర్వహిస్తున్నారు.

ధరణి పోర్టల్

ఈ రోజు నుంచి ధరణి పోర్టల్‌ను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ – NIC పూర్తి స్థాయిలో నిర్వహించనుంది. గత BRS ప్రభుత్వ హయాంలో ఈ పోర్టల్‌ను IFLS, దాని అనుబంధ సంస్థ టెర్రా ICS నిర్వహించాయి. పోర్టల్ నిర్వహణ బాధ్యతల నుంచి విదేశీ సంస్థను తప్పించి స్వదేశీ సంస్థకు అప్పగిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మేరకు చర్యలు చేపట్టి గత నవంబర్లో టెర్రా ICSతో ఒప్పందాన్ని ముగించి, అనంతరం NIC తో నిర్వహణా ఒప్పందం కుదుర్చుకుంది.

డెస్క్

పొన్నం ప్రభాకర్

గురుకులాల నిర్వహణలో అలసత్వం వహిస్తే ప్రభుత్వం సహించేది లేదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను హెచ్చరించారు. ఈ రోజు గురుకులాల సమస్యలపై వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. ప్రతి విద్యార్థిపై శ్రద్ధ తీసుకోవాలని మంత్రి సూచించారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను తరచూ సందర్శించి తనిఖీలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. భోజనం, వసతి సౌకర్యాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థికి అడ్మిషన్‌తో పాటే ఏకరూప దుస్తులు, మెటీరియల్ పంపిణీ చేయాలని అన్నారు.

డెస్క్

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మేలైన వసతి సౌకర్యాలను కల్పించడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం భోజన, కాస్మోటిక్ నిధులు పెంచిందని నీటిపారుదల

శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలియజేశారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం చిలుకూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులతో నిన్న రాత్రి నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు. పాఠశాల అభివృద్ధి నిమిత్తం పది లక్షల రూపాయలను తక్షణమే మంజూరు చేశారు. విద్యార్థులు నీట్ ఐఐటి పరీక్షలకు సన్నద్ధులను చేసేందుకు ఐదు లక్షల రూపాయలతో పుస్తకాలను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కు సూచించారు.

Suryapet/PTC

ప్రపంచ తెలుగు మహా సభలు

ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వై వార్షిక మహాసభలు ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు హైదరాబాద్ లో జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి నగరంలోని HICC వేదికగా నిలవనుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరినీ ఏకం చేసి తెలుగు భాష, సంప్రదాయం, సాహిత్యం, కళలను బలోపేతం చేయడంతో పాటు వాటిని భవిష్యత్తు తరాలకు అందించే లక్ష్యంతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల ప్రారంభ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ముగింపు వేడుకలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారు. అలాగే తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

డెస్క్

MAHA KUMBH MELA

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవం అయిన మహా కుంభమేళ ఈనెల 13వ తేదీన ప్రారంభం కానుంది. మతపరమైన విశ్వాసం, సంస్కృతీ, ప్రాచీన సంప్రదాయాల మేళవింపు అయిన మహా కుంభమేళ 12 సంవత్సరాల వ్యవధిలో నాలుగు సార్లు దేశంలో నాలుగు పవిత్ర నగరాల్లో జరుగుతుంది. హరిద్వార్ ఉజ్జయన్ నాసిక్ prayag raj నగరాలు భారతదేశంలోని

అత్యంత పవిత్రమైన నదీ తీరాలుగా ఉన్నాయి. ఫిబ్రవరి 26వ తేదీ వరకు కొనసాగే మహాకుంభమేళకు ప్రయాగరాజ్ లో అన్ని ఏర్పాట్లు చేశారు. మూడు కోట్ల మంది యాత్రికులు ఈ మేళాకు హాజరవుతారని భావిస్తున్నారు.

ఎన్.ఎస్.డి.

TRAI

మోసపూరిత వాణిజ్య సమాచారం వల్ల టెలిఫోన్ వినియోగదారులు నష్టపోకుండా భద్రత కల్పించేందుకు భారత్ టెలికాం రెగ్యులేటరీ సంస్థ- ట్రాయ్, పలు చర్యలు తీసుకుంటోందని ట్రాయ్ సలహాదారు B ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడుతూ, ప్రభుత్వ సంస్థలన్నీ తమ వినియోగదారులకు ఒకే గుర్తింపు సిరీస్ సంఖ్యతో సమాచారం పంపే ప్రతిపాదనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు.

(Soundbyte - ప్రవీణ్ కుమార్)

MSL

నూతన సంవత్సరం

నూతన సంవత్సర ఆరంభం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్థిరమైన భవిష్యత్తు కోసం అందరూ కలసి పనిచేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఏడాదిలో అందరికీ విజయం కలగాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు. ఈ ఏడాది విశ్వవేదికపై విజయ గీతికగా తెలంగాణ ప్రస్థానం ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఏడాది శుభ సంతోషాలను నింపాలని కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలకు సరికొత్త ఆనందాలను, ఐశ్వర్యాన్ని, సుఖసంతోషాలను, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని దేవుణ్ని ప్రార్థించినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

తెలియజేశారు. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తూనే, ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్ర శేఖర రావు శుభాకాంక్షలు తెలియజేశారు. 2025లో ప్రజలందరికీ శుభం జరగాలని ఆయన ఆకాంక్షించారు.

డెస్క్

టెట్ పరీక్షలు

రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ అర్హత పరీక్షలు టెట్ 2024 ప్రారంభం కానున్నాయి. రేపటి నుంచి ఈ నెల 20 వరకు పరీక్షలు జరగనున్నాయి. పేపర్ – 1 కు 94 వేల 327 మంది, పేపర్ – 2 కు లక్షా 81 వేల 426 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 17జిల్లాల్లో 92 ఆన్లైన్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు రెండు విడతలుగా ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరుగుతాయి. అభ్యర్థులను ఉదయం పరీక్షకు 7.30 గంటల నుంచి, మధ్యాహ్నం పరీక్షకు 12.30 గంటల నుంచి పరీక్షా హాల్ లోపలికి అనుమతిస్తారు.

డెస్క్

డ్రంక్ అండ్ డ్రైవ్

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నిన్న రాత్రి హైదరాబాద్‌లో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,184 కేసులు నమోదవగా, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 619 కేసులు నమోదయయ్యాయి.

డెస్క్

పోలీసు సేవా పతకాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా అందించే ప్రతిష్టాత్మకమైన పోలీసు సేవా పతకాలకు కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది ఎంపికయ్యారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ వి.రమణమూర్తి, కరీంనగర్ స్పెషల్ బ్రాంచి ఏఎస్సై మధురిమ, మానకొండూర్ హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీనివాస్, ఇంటలిజెన్స్ ఏఎస్సై ఎం.రాంమోహన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వి.గంగాధర్ విశిష్ట సేవాపతకానికి ఎంపికయ్యారు. సేవా పతకానికి ఏఆర్ ఎస్ఐ పి.రాంప్రసాద్, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, టి జగన్మోహనా చారి, ఎన్.రాజేందర్, జి.విజయప్రభాకర్, తదితరులు ఎంపికయ్యారు. ఉత్తమ సేవలకు ఎంపికైన వారికి పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి అభినందనలు తెలిపారు.

పిటిసి, కరీంనగర్

రోడ్డు భద్రతా మాసం

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల తగ్గింపే లక్ష్యంగా ఈ రోజు నుంచి 31వ తేదీ వరకు రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భద్రతా మాసంలో రోడ్డు భద్రతపై అవగాహన పెరిగేలా విద్యార్థులు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు, వర్క్ షాపులు, సెమినార్లు చేపడతారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యులవుతారు.

డెస్క్

నుమాయిష్

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన – నుమాయిష్ ను ఎల్లుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. ప్రతి ఏటా ఒకటో తేదీన

ప్రారంభమయ్యే ఈ ప్రదర్శన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సంతాప దినాల కారణంగా వాయిదా పడింది.

డెస్క్

జిన్నింగ్ మిల్లు

జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి, పత్తి గింజల నిల్వలు ఎక్కువ ఉన్నందన పత్తి కొనుగోలు ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్ నగర్, సిర్పూర్, కౌటాల, జైనూర్ లో ఉన్న జిన్నింగ్ మిల్లుల్లో ఈ రోజు నుంచి 5వ తేదీ వరకు ఐదు రోజులపాటు పత్తి కొనుగోలు ప్రక్రియ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

అసిఫాబాద్, పిటిసి

ఆటో బోల్తా

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో 20 మంది కూలీలు గాయపడ్డారు. వారిలో ఐదుగురు తీవ్రంగా గాయపడగా మరో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూర్ నుంచి, బీహార్ రాష్ట్రానికి చెందిన 20 మంది కూలీలు, ఆటోలో వెళుతుండగా బోయినపల్లి మండలం కొదురుపాక వద్ద ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను అంబులెన్సులలో ఆసుపత్రికి తరలించారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా